# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-09-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **తెలంగాణ రైతాంగానికి సాగు నీరు అందించేందుకు గోదావరి, కృష్ణా నదులపై నిర్మించే ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.**
2. **ప్రజలకు ప్రయోజనం కలిగేలా జీఎస్టీ ధరల్లో మార్పులు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.**
3. **వ్యవసాయ యాంత్రీకరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.**
4. **తెలంగాణలో రైల్వే సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు.**
5. **ఉల్లి రైతులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రహదారులు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు.**

==========================

తెలంగాణ రైతాంగానికి సాగు నీరు అందించేందుకు గోదావరి, కృష్ణా నదులపై నిర్మించే ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లో నిన్న నిర్వహించిన డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి మెమోరియల్ అవార్డు 2025 కార్యక్రమంలో పాల్గొని పురస్కారాలను ముఖ్యమంత్రి ప్రధానం చేశారు. వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయాలకు అనుగుణంగా చేపట్టిన ప్రాణహిత – చేవెళ్ల, శ్రీశైలం ఎడమ గట్టు కాలువ ప్రాజెక్ట్–ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి తెలియజేస్తూ,

వాయిస్ 32 సెకన్లు

కాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన గృహాలను ముఖ్యమంత్రి ఈ రోజు ప్రారంభిస్తారు.

---------------------------

ప్రజలకు ప్రయోజనం కలిగేలా, చిన్న పరిశ్రమలకు ఉపయోగపడేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరిన విధంగా వస్తు సేవల పన్ను– జీఎస్టీ ధరల్లో మార్పులు చేయాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. పన్ను

చెల్లింపుదారులకు అనువైన పరిస్థితులు కల్పించేలా రాష్ట్ర అవసరాల మేరకు రాష్ట్ర ప్రతిపాదనలను పరిశీలించి అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. చేనేత ఉత్పత్తులు, వ్యవసాయానికి ఉపయోగించే యంత్ర పరికరాలపై జీఎస్టీని పూర్తిగా మినహాయించాలని ఆ లేఖలో కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఇంకా 1,800 ఎకరాలు భూ సమీకరణ చేపట్టాల్సి ఉందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ సీఆర్డీఏ 52వ సమావేశం నిన్న నిర్వహించారు. అనంతరం నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ 31 సెకన్లు

---------------------------

వ్యవసాయ యాంత్రీకరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల, శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం జిల్లా జామి మండలం మొక్కాసవలస గ్రామంలో కిసాన్ డ్రోన్‌లను లబ్ధిదారులకు మంత్రి నిన్న అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద జిల్లాలో 24 డ్రోన్లను లబ్ధిదారులకు అందిస్తున్నామని చెప్పారు. ఎరువులు, పురుగు మందులను వేగవంతంగా పిచికారీ చేసేందుకు డ్రోన్‌ల వినియోగం పెరగాల్సిన అవసరం ఉందని అన్నారు. రైతులు ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలని మంత్రి కోరారు.

---------------------------

రాయచోటి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, రాయచోటిలో నూతన ఆర్టీసీ బస్టాండ్, ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని త్వరలోనే పనులను ప్రారంభించనున్నామని తెలిపారు. ఆయుష్ వైద్య కళాశాలను ఏర్పాటుకు శంఖుస్థాపన చేయనున్నామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ 27 సెకన్లు

---------------------------

తెలంగాణలో రైల్వే సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. అమృత్‌భారత్ పథకం కింద మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో చేపట్టిన పునరాభివృద్ధి పనులు 92 శాతం పూర్తయ్యాయని తెలుపుతూ స్టేషన్ భవనం, వెయిటింగ్‌హాల్ ఫొటోల్ని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా విడుదల చేశారు. 2 కోట్ల 64 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక సౌకర్యాలతో త్వరలోనే ఈ స్టేషన్ ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఉల్లి రైతులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రహదారులు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి తెలిపారు. నంద్యాలలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ఉమ్మడి కర్నూలు

జిల్లాలో ఉల్లి రైతుల నుంచి మార్క్ ఫెడ్ ద్వారా ఇప్పటికే ఉల్లి పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. ఇతర రాష్ట్రాలలో దిగుబడి పెరగడంతో ధరలు తగ్గాయని మంత్రి వివరించారు.

---------------------------

తెలంగాణలో ఆరోగ్యశ్రీ పథకానికి అదనంగా నిధులను కేటాయించనున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. మహబూబాబాద్‌లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్యకళాశాలకు అనుబంధంగా నిర్మించిన వసతిగృహ భవనాలు, 50 పడకలతో నిర్మించిన అత్యవసర విభాగాన్ని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖతో కలిసి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజనర్సింహ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించనున్నామని చెప్పారు.

---------------------------

ఈ రోజు ప్రపంచ ఆకాశ హర్మ్యాల దినోత్సవం స్కై స్క్రేఫర్స్ డే నిర్వహిస్తున్నారు. బహుళ అంతస్తుల భవన నిర్మాణ పితామహునిగా పేరు గాంచిన ....,అమెరికాకు చెందిన లూయిస్ హెన్రీసల్లివాన్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరుగుతోంది. 1856 సెప్టెంబర్ 3 వ తేదీన జన్మించిన ఆయన తన ఇంజనీరింగ్ నైపుణ్యంతో అనేక బహుళ అంతస్తుల భవనాలను తీర్చిదిద్దారు. ప్రస్తుత ఆధునిక జీవన స్రవంతిలో బహుళ అంతస్తుల భవనాలు కీలక భూమిక పోషిస్తున్నాయి. నగరాలు, పట్టణాల్లో బహుళ అంతస్తుల భవనాలే ప్రజలకు తమ తమ ఆర్థిక శక్తిని బట్టి నివాస యోగ్యంగా మారుతున్నాయి. అయితే...ఉత్తర ప్రదేశ్ లోని నోయిడా నగరంలో నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించిన జంట ఆకాశ హర్మ్యాల కూల్చి వేత ఘటనను దృష్టిలో ఉంచుకుని భవన నిర్మాతలు ప్రభుత్వ నిబంధనల మేరకు భవనాలు నిర్మించవలసిన అవసరం ఉంది.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ – వాయువ్య దిశగా ఒడిషా మీదుగా కదిలే అవకాశముందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రెండు రోజులపాటుఈరోజు కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి జగన్నాథ కుమార్ తెలియజేస్తూ...

వాయిస్..22 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ అల్పపీడన ప్రభావంతో ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ప్రతి ఒక్కరికి విద్య అందాలని గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు అన్నారు. విజయనగరం కోటలో గతంలో ఉన్న మోతీ మహల్ స్థానంలో 12.75కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన కొత్త భవనాన్ని ఆయన నిన్న ప్రారంభించారు.

====================